ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :196 సోమవారం మే 11 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com


PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## మాతృదినోత్సవంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం

●తల్లుల త్యాగాలను గుర్తుచేసుకున్న ప్రముఖులు

●అమ్మ ప్రేమకు సాటి మరొకటి లేదన్న చంద్రబాబు

●తల్లులందరికీ నాయకుల శుభాకాంక్షలు



అమరావతి, మే 10 (మనప్రజాప్రతినిధి): ఈ సృష్టికి మూలం అమ్మేనని, ఆమె త్యాగాలకు ఎంత చేసినా రుణం తీర్చుకోలేమని రాష్ట్రవ్యాప్తంగా మాతృదినోత్సవం సందర్భంగా ప్రముఖులు కొనియాడారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత సహా పలువురు ప్రముఖులు తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మాతృ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సందేశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతి జీవం అమ్మ ప్రేమతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అమ్మ త్యాగం, లాలనకు వెలకట్టలేమని అన్నారు. కరుణకు ప్రతిరూపంగా తల్లి నిలుస్తుందని, ఆమె నిశ్శబ్ద శక్తి కుటుంబాలను నిలబెడుతుందని కొనియాడారు."అమ్మ స్వభావం ఎంతో సున్నితమైనది. కానీ ఆమె ఆత్మస్థైర్యం అసాధారణం. తల్లుల అంకితభావమే కుటుంబాలను చక్కగా తీర్చిదిద్దుతుంది. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ మానవత్వాన్ని కాపాడేది అమ్మే" అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు గురువు, దైవం, మార్గదర్శి అన్నీ తల్లేనని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా మాతృమూర్తుల సేవలను గుర్తుచేసుకుంటూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబం కోసం తల్లులు చేసే త్యాగాలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత మహిళల గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ తల్లిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమాలు, విద్యాసంస్థలు, సేవా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి తల్లులను సత్కరించారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రముఖుల సందేశాలు వైరల్‌గా మారాయి.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ప్రధాని మోదీ



❍జూబ్లీహిల్స్ నివాసానికి వెళ్లిన ప్రధాని

❍ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన మోదీ

❍పత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

హైదరాబాద్, మే 10 (మన ప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లిన ప్రధాని, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను కలుసుకున్న ప్రధాని మోదీ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిం చారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించి నట్లు సమాచారం. తన కోసం స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరి మధ్య కొద్దిసేపు ఆత్మీయంగా చర్చ జరిగినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన అనంతరం ప్రధాని మోదీ జూబ్లీ హిల్స్‌లోని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రితో పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు సమాచారం. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా కూటమి నాయకులతో ఆయన సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.

## మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత



-మాతృదినోత్సవ వేడుకల్లో హోంమంత్రి అనిత సందేశం

-వృద్ధ మహిళల ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం

-తల్లుల త్యాగాలను మరవొద్దని పిలుపు

కృష్ణా జిల్లా, మే 10 (మనప్రజాప్రతినిధి): మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. తల్లులు పిల్లల కోసం చేసే త్యాగాలను ఎప్పటికీ మరవొద్దని సూచించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలోని వృద్ధ మహిళల ఆశ్రమంలో నిర్వహించిన మదర్స్ డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కూడా పాల్గొన్నారు. ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధ మహిళలతో మాట్లాడిన హోంమంత్రి అనిత, వారికి చిన్న ఆనందాన్ని పంచాలని తాను వచ్చినట్లు తెలిపారు. ఎంతోమంది తల్లులు తమ పిల్లలకు దూరంగా జీవిస్తున్నారని, వారి ఆశీస్సులు పొందడం తనకు ఆనందంగా ఉందన్నారు. ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న వాసవి మహిళా మండలి సేవలను ఆమె ప్రశంసించారు. అక్కడి వాతావరణం, వృద్ధ మహిళల కళ్లలో కనిపిస్తున్న ఆనందం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. సమాజంలో తల్లికి ఉన్న స్థానం అత్యున్నతమని, దేవుడు కూడా మొదటి స్థానాన్ని తల్లికే ఇచ్చాడని వ్యాఖ్యానించారు. అలాంటి తల్లులు ఎప్పుడూ ఇబ్బందులు పడకూడదని పేర్కొన్నారు. ఒక బిడ్డను జన్మనివ్వడానికి తల్లి ఎంతటి ప్రసవ వేదన అనుభవిస్తుందో ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని హోంమంత్రి అన్నారు. పిల్లలను పెంచి పెద్దచేయడంలో తల్లులు ఎన్నో త్యాగాలు చేస్తారని చెప్పారు. అలాంటి తల్లులకు అండగా నిలబడటం సమాజ బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి తన ఇద్దరు పిల్లలను కూడా తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళల సాధికారత విషయంలో నారా లోకేశ్ చూపుతున్న స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. మహిళలకు గౌరవం ఇచ్చే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో తల్లిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధాశ్రమాల అవసరం లేకుండా ప్రతి బిడ్డ తన తల్లిదండ్రులను చూసుకోవాలని సూచించారు. మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి కుటుంబం నుంచి ప్రారంభం కావాలని పేర్కొన్నారు.

## డీజీపీ కార్యాలయం ముట్టడించిన బీఆర్ఎస్‌వీ నేతలు




-బండి భగీరథపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

-బాధిత కుటుంబాన్ని వేధించిన అధికారులపై విచారణ కోరిన గెల్లు శ్రీనివాస్

-కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విమర్శలు

హైదరాబాద్, మే 10 (మనప్రజాప్రతినిధి): మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటూ పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ బీఆర్ఎస్‌వీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంను ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకు నాయకత్వం వహించిన బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కేసులో నిందితుడిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులను వేధించిన పోలీసు అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ను వెంటనే పదవి నుంచి తొలగించాలని గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఒక విధమైన న్యాయం, సాధారణ ప్రజలకు మరో విధమైన న్యాయమా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై కూడా బీఆర్ఎస్‌వీ నేతలు విమర్శలు గుప్పించారు. నిందితుడిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. డీజీపీ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచారు. ఆందోళనకారులను అడ్డుకునే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.

## సింధు ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాని మోదీ




-ఆరోగ్య రంగంలో కీలక ముందడుగని ప్రశంస

-అత్యాధునిక సాంకేతికతపై ప్రధాని అభినందనలు

-హైదరాబాద్‌లో వైద్య మౌలిక సదుపాయాలకు ఊతం

హైదరాబాద్, మే 10 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సింధు ఆసుపత్రిను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇది ఒక ప్రశంసనీయమైన ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, ఆసుపత్రి బృందాన్ని అభినందించారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు వినూత్న ఆవిష్కరణలను వైద్య సేవల్లో సమన్వయం చేయడంపై ఆసుపత్రి ప్రత్యేక దృష్టి పెట్టడం అభినందనీయమని తెలిపారు. సింధు ఆసుపత్రి ప్రారంభంతో హైదరాబాద్‌లో వైద్య సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అత్యాధునిక చికిత్సా సౌకర్యాలు, నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన సేవలు లభించే అవకాశముందని చెబుతున్నారు. ఇటీవల ఆరోగ్య రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సింధు ఆసుపత్రి ప్రారంభం ప్రాధాన్యత సంతరించుకుంది

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది

**-రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమన్న మోదీ**

**-హెచ్ఐసీసీ వేదికగా పలు ప్రాజెక్టులకు శ్రీకారం**

**-రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు**



హైదరాబాద్, మే 10 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రాల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చిన ఆయన, హైదరాబాద్ హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు చేశారు. "గత పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారు. అయితే గుజరాత్‌కు ఎంత ఇచ్చామో చెప్పాలని నేనే ఇప్పుడు రేవంత్ రెడ్డిని అడుగుతున్నా" అంటూ ఛలోక్తులు విసరడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. సైబరాబాద్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని మోదీ అన్నారు. ఐటీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోందని కొనియాడారు. అనేక భారీ ప్రాజెక్టులకు కేంద్రంగా సైబరాబాద్ ఎదుగుతోందని చెప్పారు. అలాగే వరంగల్‌లో ప్రారంభించిన పీఎం మిత్ర పార్క్ టెక్స్‌టైల్ రంగంలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. రైల్వే రంగంలో తెలంగాణకు గతంతో పోలిస్తే భారీగా నిధులు పెంచినట్లు ప్రధాని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రైల్వే బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కూడా దక్కేవి కాదని, ప్రస్తుతం ఒక్క తెలంగాణకే రూ.5,500 కోట్లకు పైగా కేటాయిస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, తెలంగాణ కూడా దాని ప్రయోజనాలు పొందుతోందని పేర్కొన్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు, కాజీపేట రైల్ అండర్ బైపాస్ లైన్, వరంగల్ పీఎం మిత్ర పార్క్, మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ గ్రీన్ ఫీల్డ్ టెర్మినల్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంకు చేరుకున్న ప్రధాని మోదీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్తో పాటు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. ప్రధాని పర్యటన సందర్భంగా నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.



# యథావిధిగా ఇంటర్ ప్రవేశాలు

**- విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలగకుండా ప్రభుత్వ నిర్ణయం**

**- 11, 12 తరగతుల విధానంపై ఇంకా అధ్యయనం**

**- శాసనసభ చర్చ తర్వాతే తుది నిర్ణయం**

**- సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, మే 10 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ఇంటర్ మీడియట్ ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరంలో యథావిధిగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియలో ఇంకా పలు సాంకేతిక సమస్యలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. అడ్మిషన్లకు సమయం తక్కువగా ఉండటంతో ఆలస్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు.తెలంగాణ విద్యా కమిషన్ ఇప్పటికే ఇంటర్‌మీడియట్ వ్యవస్థను రద్దు చేసి, కేంద్ర మాధ్యమిక విద్యా మండలి విధానంలో 11, 12 తరగతులను అమలు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ మార్పుతో విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువును మధ్యలోనే నిలిపివేయకుండా కొనసాగించే అవకాశాలు పెరుగుతాయని కమిషన్ అభిప్రాయపడింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేసిన అనేక మంది విద్యార్థులు వేరు జూనియర్ కళాశాలల్లో చేరకుండా విద్యను ఆపేస్తున్న పరిస్థితి ఉందని నివేదికలో పేర్కొంది.దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికే 11, 12 తరగతుల విధానాన్ని అమలు చేస్తుండగా తెలంగాణలో మాత్రం ఇంటర్‌మీడియట్ ప్రత్యేక విధానంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇంటర్‌ను పాఠశాల విద్యలో భాగంగా మార్చాలని ముఖ్యమంత్రి గతంలోనే అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ విద్యా కమిషన్ కూడా తన నివేదికలో ప్రస్తావించింది.ఇటీవల ఇంటర్ ప్రవేశాలను నిలిపివేస్తూ వచ్చిన ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. దీనిపై ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం దెబ్బతినకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.ఇంటర్ విలీన ప్రక్రియలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించింది. విద్యావేత్తలు, అధికారులు, విద్యార్థి సంఘాలు సహా అన్ని వర్గాలతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ విద్యా విధానంపై నియమించిన కమిటీ ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం సూచించింది. ఆ నివేదికపై శాసనసభలో విస్తృత చర్చ నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అప్పటి వరకు ఈ విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలు సాధారణ విధానంలో కొనసాగనున్నాయి.

# అమెరికాలో తెలుగు యువతి విషాద మృతి

**-ఫ్లోరిడాలో స్విమ్మింగ్ పూల్‌లో పడి ప్రమాదం**

**-ఉన్నత చదువుల కోసం వెళ్లిన యువతి అకాల మరణం**

**-కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



హైదరాబాద్, మే 10 (మనప్రజాప్రతినిధి): ఉన్నత చదువులు, మెరుగైన భవిష్యత్తు కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి ప్రమాదవశాత్తు మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. హైదరాబాద్‌కు చెందిన యువతి వీణ అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. హైదరాబాద్‌లోని లింగోజిగూడ ప్రాంతానికి చెందిన వీణ ప్రస్తుతం అమెరికాలోని వర్జీనియాలో నివసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల ఫ్లోరిడాలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందినట్లు సమాచారం.ఈ విషాద వార్త తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నత లక్ష్యాలతో విదేశాలకు వెళ్లిన యువతి అకాల మరణం స్థానికంగా విషాదాన్ని నింపింది. వీణ కుటుంబ సభ్యులను దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించాలని అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ ఘటనతో లింగోజిగూడ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. విదేశాల్లో చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లే యువత భద్రతపై కుటుంబాలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరుకు బుల్లెట్ రైలు



**-ఆంధ్రప్రదేశ్ మీదుగా హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదనలు**

**-గంటకు 600 కిలోమీటర్ల వేగానికి అనుగుణంగా డిజైన్**

**-అమరావతి విమానాశ్రయాన్ని కలుపుతూ ఎలైన్‌మెంట్ మార్పులు**

హైదరాబాద్/అమరావతి, మే 10 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్‌ను ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగళూరుతో అనుసంధానించే అత్యాధునిక బుల్లెట్ రైలు కారిడార్ల రూపకల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రైళ్లకు అనుగుణంగా ప్రారంభంగా ప్రణాళికలు రూపొందించినప్పటికీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంటకు 600 కిలోమీటర్ల వేగాన్ని తట్టుకునే విధంగా కారిడార్ డిజైన్‌లో మార్పులు చేస్తున్నారు. అయితే రైళ్లు గరిష్ఠంగా గంటకు 320 కిలోమీటర్ల వేగంతోనే నడిచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ మార్గాన్ని అమరావతిలో ప్రతిపాదిత విమానాశ్రయం మీదుగా తీసుకెళ్లేలా మార్గరేఖల్లో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గత ఏడాది అక్టోబర్‌లోనే రైల్వే అధికారులకు సూచించారు. దీనికి అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపగా, కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది.హైదరాబాద్ నుంచి చెన్నై వరకు రెండు ప్రధాన మార్గాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక ప్రతిపాదన ప్రకారం శంషాబాద్, బాటసింగారం, నార్కెట్‌పల్లి, ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం మీదుగా చెన్నై సెంట్రల్ వరకు హైస్పీడ్ రైలు మార్గం ఉండనుంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శంషాబాద్, ఫ్యూచర్ సిటీ, దాచేపల్లి మీదుగా అమరావతికి చేరే ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్ మొత్తం సుమారు 760 కిలోమీటర్ల మేర ఉండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే దాదాపు 504 కిలోమీటర్లు ఉండనున్నాయి. ఇదే సమయంలో హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌పై కూడా కీలక చర్చలు కొనసాగుతున్నాయి. ఈ మార్గం శంషాబాద్, భారత్‌సిటీ, మహబూబ్‌నగర్ మీదుగా కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, హిందూపురం మీదుగా బెంగళూరుకు చేరేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.తెలంగాణ ప్రభుత్వం మాత్రం మన్ననూర్, సోమశిల రోడ్ మార్గంగా కర్నూలుకు చేరే ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌ను సూచించింది. ఈ కారిడార్ మొత్తం సుమారు 605 కిలోమీటర్లు ఉండగా, అందులో 263 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తాయి. ఈ మార్గాలపై తుది నిర్ణయం కోసం అధికారులు సర్వేలు, సాంకేతిక అధ్యయనాలు కొనసాగిస్తున్నారు. ఇక చెన్నై-బెంగళూరు మధ్య 306 కిలోమీటర్ల హైస్పీడ్ రైల్ కారిడార్‌ను కూడా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, పలమనేరు ప్రాంతాల మీదుగా సుమారు 90 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. చిత్తూరు నుంచి తిరుపతికి ప్రత్యేక హైస్పీడ్ లింక్ ఏర్పాటు చేస్తే చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై కారిడార్లకు అనుసంధానం కలుగుతుందని సీఎం చంద్రబాబు సూచించినట్లు సమాచారం.ఇటీవల విశాఖపట్నం పర్యటన సందర్భంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్తో చంద్రబాబు ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. చిత్తూరు-తిరుపతి హైస్పీడ్ లింక్‌ను పరిశీలిస్తామని రైల్వే మంత్రి వెల్లడించారు. అదేవిధంగా విజయవాడ నుంచి విశాఖపట్నం వరకు హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనను కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ కారిడార్ల పనులు పూర్తి అయిన తర్వాత విజయవాడ-విశాఖ మార్గాన్ని తదుపరి దశలో పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ముఖ్యమంత్రిగా తొలి సంతకం

**-200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు ఆమోదం**

**-మహిళా భద్రత, ఉచిత బస్సు ప్రయాణంపై కూడా నిర్ణయాలు**

**-విజయ్‌కు అభినందనలు తెలిపిన శ్రీలంక అధ్యక్షుడు**




3

# ముఖ్యమంత్రిగా తొలి సంతకం




తరువాయి భాగం

చెన్నై, మే 10 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సి. జోసెఫ్ విజయ్ తన ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆదివారం ఉదయం చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఘన కార్యక్రమంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్‌తో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్న విజయ్, ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై వరుసగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు మహిళా భద్రతకు సంబంధించిన చర్యలు, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అంశాలకు సంబంధించిన ఫైళ్లపై కూడా సంతకాలు చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర రాజకీయ నాయకులు హాజరయ్యారు. సినీ రంగ ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడాన్ని అభిమానులు భారీ స్థాయిలో సంబరంగా జరుపుకున్నారు.ఇదిలా ఉండగా, తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కు అనుర కుమార దిసానాయకే అభినందనలు తెలిపారు. శ్రీలంక, తమిళనాడు మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. భవిష్యత్తులో ఆర్థిక సహకారం మరింత బలపడాలని, భారత్-శ్రీలంక సంబంధాలు మరింత సన్నిహితంగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన విజయ్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై తొలి రోజునే దృష్టి పెట్టడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పొన్నం మల్లయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మహాదేవుని శ్రీనివాస్



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొన్నం చంద్రయ్య గౌడ్,తండ్రి పొన్నం మల్లయ్య గౌడ్,ఈ నెల మూడవ తేదీన మరణించిన విషయం తెలిసి,వారి నివాసానికి వెళ్లి కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్,కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ,మల్లయ్య గౌడ్,మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కష్టకాలంలో కుటుంబానికి ధైర్యం చేకూరాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బొచ్చు ఎల్లయ్య యాదవ్,సార్ల కోల్ బాయ్ కనకయ్య ముదిరాజ్,చింతల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# మోడీ సభకు భారీగా తరలిన నాయకులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 10:హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగే ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు చేగుంట నుండి భారీగా జనం కదిలారు. మండల అధ్యక్షులు దొంతిరెడ్డి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్యకర్తలు బస్సుల్లో, కార్లలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,, వివిధ గ్రామాల సర్పంచ్ లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 10:చేగుంట మండల కేంద్రం లో గోల్డెన్ ఫంక్షన్ హాల్లో బేగంపేట్ గ్రామానికి చెందిన మనక సుదర్శనం, కుమారుని వివాహ వేడుకల్లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి,ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య యాదవ్, చేగుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ , ఉపాధ్యక్షుడు మాసాయిపేట శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కోండి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, ఇబ్రహీంపూర్ ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్, రాయపోల్ మండలాధ్యక్షుడు సుధాకర్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా



మనప్రజాప్రతినిధి//దినపత్రిక,బచ్చన్నపేట,జనగామ: జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణంలోని ప్రసన్న గార్డెన్స్‌లో జరిగిన వివాహ వేడుకలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిడుగు రాజపతి కుమార్తె హారిక వివాహానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వధూవరులకు ఆశీస్సులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వధూవరులను ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# రవాణా సౌకర్యం కోసం రాష్ట్ర మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు





మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 10,:చేగుంట మండలం లోని చందాయిపేట్, ఇబ్రహీంపూర్, పొలంపల్లి, అన్నంతసాగర్ పొలంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం రోజు హైదరాబాద్ లో మంత్రి నివాసంలో రాష్ట్ర మంత్రివర్యులు, రాష్ట్ర రవాణా శాఖ ,, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి తమ గ్రామం నుండి చేగుంటకు, తూప్రాన్ కు వెళ్లే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే పొలంపల్లి గ్రామం లో బస్టాండ్ నిర్మించాలని మంత్రివర్యులకు తెలపగా వెంటనే సానుకూలంగా స్పందించి త్వరలోనే మీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, జనరల్ సెక్రటరీ కొండి శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్,పొలంపల్లి గ్రామ అధ్యక్షులు కర్రే స్వామి, వెంకటేశం పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలింది



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, మే 10 : రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని మాజీ మంత్రి ఆరోపించారు. ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి చేగుంట మండలం కర్నాల పల్లి గ్రామం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . కొనుగోలు కేంద్రం ప్రారంభించి 25 రోజులు గడిచినా కేవలం రోజు రెండు లారీలు మాత్రమే రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. వర్షాలకు తడిసిన వడ్లను రైతులు మళ్లీ ఆరబెట్టినా కొనుగోళ్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు స్పందించడం లేదన్నారు.ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం కనీస సమీక్ష కూడా నిర్వహించడం లేదని ఆరోపించిన ఆయన, ఏసీ గదుల్లో కూర్చుని మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులే కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ విక్రయించిన రైతులకు ఇప్పటికీ చెల్లింపులు చేయలేదని, జొన్నల కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి వల్లే ప్రస్తుతం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం వెంటనే లారీలు పంపించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరపున బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ, నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం జనగామ మండలం పెంబర్తి గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్న దుర్గమ్మ ముగింపు ఉత్సవాల్లో ఆదివారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.డప్పుల మోతలు,మంగళ వాయిద్యాల మధ్య గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగ తం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ..గ్రామ ప్రజల సుఖసంతోషాలు, పంటలాభాలు, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, గ్రామంలో ఐక్యత, శాంతి నెల కొనాలని ఆకాంక్షించారు.అనంతరం తర్వాత గ్రామ సర్పంచ్ ఆహ్వానం మేరకు వారి నివాసానికి ఎమ్మెల్యే పల్లా వెళ్లి అక్కడ స్థానిక ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించారు.గ్రామ అభివృద్ధి,ప్రజా సమస్యలు, కొనసాగుతున్న సంక్షేమ కార్యక్ర మాలపై కాసేపు చర్చించారు. ఎమ్మెల్యేను కలిసి ప్రజలు తమ సమస్య లను వివరించారు.వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## 11 ఏళ్ల మోడీ పాలనలో... బీసీలకు ఏం న్యాయం చేశారు



హైదరాబాద్( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):బీసీ ప్రధాని గా చెప్పుకుంటున్ననరేంద్ర మోడీ తన 11 ఏళ్ల పరిపాలనలో బీసీలకు ఏం న్యాయం చేశాడని శాసనమండలి సభ్యులు సిపిఐ రాష్ట్ర నాయకులు నెల్లికంటి సత్యం సూటిగా ప్రశ్నించారు. ఆదివారం నాడు హైదరాబాదులోని అసెంబ్లీ ముందు గల అమరవీరుల స్తూపం వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షకు హాజరైన మాట్లాడుతూ..... నరేంద్ర మోడీకి నమో అనే ముద్దు పేరు ఉన్నదని నమో అంటే నమ్మించి మోసం చేయడమేనని ఆయన ఎద్దేవా చేశారు బిజెపి పార్టీ ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు కులగణనను చేపట్టాలని పార్లమెంట్లో అనేకసార్లు రభస చేసిందని తీరా బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ పదకొండు సంవత్సరాల కాలములో కులగణన చేపట్టకుండా ఏకాభిప్రాయ సాధన పేరుతో వాయిదా వేస్తూ వస్తున్నారని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలని పలుమార్లు బీసీ సంఘాలు డిమాండ్ చేసినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని కుల గణన పత్రంలో బీసీ కాలమ్ లేకపోవడం అత్యంత బాధాకరమని తక్షణమే కుల గణన చేపట్టి ఏ కుల జనాభా ఎంత ఉందో అదే దామాషా పద్ధతుల్లో విద్యా వైద్యం ఉద్యోగం ఉపాధి రాజకీయ రిజర్వేషన్లతో పాటు బడ్జెట్లో నిధులు కూడా అదే దామాషా పద్ధతిలో విడుదల చేసి స్వాతంత్ర ఫలాలు అందరికీ దక్కేలా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నదని బీసీలు ఏకమైతే అగ్రవర్ణ పార్టీగా ముద్ర పడ్డ బిజెపికి నూకలు చెల్లిపోతాయని నరేంద్ర మోడీతో పాటు ఆయన పరివారం అంతా భీతిల్లుతున్నారని ప్రజా ఉద్యమాలను నిర్మించి క్షేత్రస్థాయిలో బీసీల ఉద్యమాల్ని తీసుకువెళ్లి బీసీలను చైతన్యపరచి కేంద్రం మెడలు వంచి బీసీలకు న్యాయం జరిగే వరకూ శాసనమండలి లోపల బయట ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ సిరికొండ మధుసూదనాచారి షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ జాజుల లింగం గౌడ్ బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజమౌళి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దీటి నరసయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ ప్రమీల కుమారస్వామి సహాయ కార్యదర్శులు పల్నాటి యాదయ్య విజయుడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాపురాజు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే నరసింహా బాలయ్య యాదవ్ పాల్గొన్నారు

## పెంబర్తిలో దుర్గమ్మ పండగ వేడుకల్లో పాల్గొన్న కొమ్మూరి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.పెంబర్తి గ్రామంలో నిర్వహించిన దుర్గమ్మ పండగ (జాతర) సందర్భంగా జనగామ నియోజకవర్గం ఇంచార్జీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,దుర్గమాత అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.వారి వెంట జనగామ హైదరాబాద్ గ్రంధాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,పిఎసిఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి,జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొలుసుల దుర్గేష్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి,వార్డు కౌన్సిలర్ లు లోకమంత్ రెడ్డి,నాని, ప్రసాద్,ఏఎంసి.డైరెక్టర్లు కొండల్ రెడ్డి,నామాల శ్రీనివాస్,సీనియర్ నాయకులు పజ్జూరి జయహరి,బడికే కృష్ణ స్వామి,సాదం మధుసూదన్ యాదవ్,సంకటి యాదగిరి,సుదగని కృష్ణా,ప్రభాకర్ యాదవ్,శ్రీను,రమేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్,రాజు, రమేష్,రాజేష్,చింటూ, మరియు మండల నాయకులు,గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీ ర్వదించిన మహదేవుని శ్రీనివాస్



మన ప్రజాప్రతినిధి దినపత్రిక, కొమురవెల్లి, జనగామ నియోజక ˇవర్గం: జనగామ నియోజకˇవర్గం. చేర్యాలలోని రేణుక గార్డెన్స్‌లో జరిగిన గౌరాయపల్లి వాస్తవ్యులు కొయ్యడ రాజమణి శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ మరియు కొమురవెల్లి ఎంపీటీసీ,ఏకైక పుత్రిక అనూష శ్రీధర్‌ల వివాహ వేడుకకు కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో, పరస్పర ప్రేమాభిమానాలతో నిండి పోవాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో బొచ్చు ఎల్లయ్య యాదవ్,గుండా చంద్రం,ప్రవీణ్ రెడ్డి,ఏ సిరెడ్డి మల్లారెడ్డి,జంగని రవి,ప్రసాద్ రెడ్డి,బాల్ రెడ్డి,సార్ల కోల్బాయ్ కనకయ్య,చింతల రమేష్,తదితరులు పాల్గొన్నారు.

